స్కెచ్

# సంధ్యాజీవులు

అంగర సూర్యారావు

యంత్రపు చక్రాలలా గుమస్తాల చేతులు చకచకా తిరిగి పోతున్నై. రాసిన కాగితాలతో ట్రేలు నిండిపోతున్నాయ్. ఐదు గంటలు అయిపోతోంది.

ఆయిల్ లేకపోతే యంత్రం నడవదు.

తగినంత మేతలేకపోతే గుర్రం పరుగెత్తదు.

గుమస్తాకుమాత్రం యీ బాధ లేదు.

తిండిలేకపోయినా పనిచెయ్యగలడు.

తిట్టినా పడగలడు.

డబ్బుకివున్న దరిద్రం పౌరుషానికి కూడా వుంటే ఎంతబాగుంటుంది!

గోపాలం బుర్రలో రైళ్లు పరుగెత్తుతున్నై.

“ఏమోయ్ గోపాలం! ఐదున్నరఅయిపోయినా యింకా తెగరాస్తున్నావేమిటి?”

తలయెత్తి చూశాడు గోపాలం. ఎదురుగా సుబ్బారావు నుంచుని వున్నాడు.

“యింక ఎంతోలేదు. మరొక కాగితంవుంది. అదికూడా రాసి లేస్తాను”అన్నాడు గోపాలం.

చివరికాగితాన్నికూడా ట్రేలోవేసి లేచాడు గోపాలం. ఇద్దరూ బయలుదేరారు.

“కాలచక్రంలో దొర్లిపోయే రోజులన్నిటిలోనూ గడ్డురోజు లేమిటో చెప్పగలవూ?” అన్నాడు గోపాలం.

“సిగరెట్లకు డబ్బులేనిరోజులు.” సమాధానం చెప్పేడు సుబ్బారావు.

“ఉహుం. అది సరికాదు. నెలలో చివరి రోజులు. నా జేబులో డబ్బులు మూడురోజుల క్రితమే అయిపోయాయి. కనుచూపుమేరలో యింకా ఒకటవతేదీ కనిపించడంలేదు. యీమధ్య రోజులు ఎలాగడపాలో అర్థంకావడంలేదు.”

ఇంతలో పరుగెత్తుకువచ్చిన ఆఫీసు బంట్రోతునుచూసి ప్రసంగాన్ని ఆపుచేశాడు గోపాలం.

“ఏరా! కొంపమునిగిపోయినట్లు పరుగెత్తుకు వచ్చావ్?” కోపంతో అడిగాడు సుబ్బారావు.

“మీరు కాగితాలన్నీ వదిలేసి వెళ్ళిపోతున్నారంట. మిమ్మల్ని పిలుచుకు రమ్మన్నారు దొరగారు!” అన్నాడు బంట్రోతు.

వాళ్ళిద్దరికీ చావువార్త విన్నంతపని జరిగింది.

“ఒరేయ్! వెంకయ్యా! మేం యిప్పుడు ఆఫీసుకు వచ్చామంటే రాత్రి పది గంటలవరకూ మేమూ మాతోపాటునువ్వూ శవజాగారం చెయ్యవలసివుంటుంది. కనక నువ్వు వెనక్కి వెళ్ళి ఎంత వెతికినా మేము దొరకలేదని దొరగారితో చెప్పెయ్!” అన్నాడు సుబ్బారావు.

సుబ్బారావు సూచన బంట్రోతుకు ఘాటుగా నచ్చింది. “మాబాగా చెప్పారుబాబూ! అలాగే సెబుతాను.” సంతోషంతో వాడు వెనక్కి పరుగెత్తాడు.

“ఉదయంకూడా నేను సరిగా భోజనంచెయ్యలేదు. ఇప్పటికే బాగా ఆకలి వేస్తోంది. ఇప్పుడు వెనక్కి వెళ్ళి పనిచేయాలంటే మాటలా?” నిరుత్సాహంగా అన్నాడు గోపాలం.

ఇంతలో సుబ్బారావుకి ఎవరో స్నేహితుడు దొరికాడు. వాళ్లిద్దరూ నేటి సినిమాతారల అవయవాలంకరణలోగల అవనీతిని గురించి చర్చను ప్రారంభించారు. ఆచర్చ ఎంత సేపటికీ పూర్తి అయ్యేటట్లు కనిపించలేదు. వాళ్ళను విడిచిపెట్టి గోపాలం యింటికి బయలుదేరాడు. యిల్లుచేరుకొనేసరికి రాత్రి ఏడు గంటలయింది.

“యింటిలో బియ్యం లేనప్పుడుకూడా ఇంత ఆలస్యంగా వస్తే ఎలాగండీ? వేగం వూళ్ళోకివెళ్ళి తీసుకురండి.”గుమ్మందగ్గరే ఎదురై సంచీఇచ్చింది యిల్లాలు.

నిస్పృహతో సంచీతీసుకొని గుమ్మం దిగేసరికి ముత్యాలు ఎదురొచ్చాడు. సెట్టి శకునం మంచిదే అయినా —యీ సమయంలో— అతన్ని చూడగానే గోపాలానికి గుండె ఆగిపోయినంత పని జరిగింది.

"ఏంవయ్యా గోపాలం నువ్వు యింక బాకీ తీర్చదలుచుకోలేదా ఏమిటి? యిప్పటికెన్ని వాయిదాలు దాటిపోయినాయయ్యా పంతులూ?" నిలదీసి అడిగాడు ముత్యాలు.

"చూడు ముత్యాలూ! యీమధ్య వ్యవహారం బాగులేదు. వారంరోజులలో నీ బాకీ మొత్తం తీర్చేస్తాను." సమాధానంగా చెప్పాడు గోపాలం. కాని ముత్యాలు వూరుకోలేదు. వీధిలో వాళ్లంతా వినేటట్లు కేకలు పెట్టి వెళ్ళిపోయాడు.

గోపాలం నడుస్తూ ఆలోచిస్తున్నాడు. రెండు రూపాయలు దొరికితేచాలు యీ రోజు గడిచిపోతుంది. సంసారం! తను పెళ్ళి చేసుకోకపోయినా బాగుండేది. తన క్లాస్‌మేట్ శేషగిరి యింకా ఇంటర్మీడియట్ పరీక్షమీదికి ఆరవ దండయాత్రకు సన్నాహాలు చేసుకుంటున్నాడు. ఎలాగైనా యీ లోకం డబ్బున్నవాడికోసం ఉద్దేశించబడినదే! ఇంకా చదువుకోవలసిన యీ వయసులో తనకీ ఉద్యోగం-సంసారం! ఎవడో మహానుభావుడు యీ బాధంతా పడలేక ఉక్కిరిబిక్కిరై "మాయామేయ జగం" అన్నాడు.

"ఏరోయ్ గోపాలం, నిజంగా దేవుడిలా కనపడ్డావురా!"

గోపాలం ఉలిక్కిపడి తలెత్తి చూశాడు. తిన్నగా దెయ్యంలా కనబడ్డాడు జగన్నాథం. ఇతను గోపాలానికి దూరపుబంధువు. పట్నం పనిమీద వచ్చినప్పుడు గోపాలం యింట్లో మకాం వేస్తూ వుంటాడు. ప్రస్తుతం గోపాలం యిల్లు మార్చాడు. అందువల్ల ఆ బంధువుకి గోపాలం యిల్లు కనుక్కోవడం చాలా కష్టమైంది. ఇంతలో గోపాలమే దేవుడిలా కనిపించాడు.

"మీ యింటికోసం సాయింత్రంనుంచి తెగ వెతుకుతున్నానురా గోపాలం" అన్నాడా బంధువు.

"అదుగో! ఆ సందుమలుపు తిరగగానే కనిపించే మొదటి యిల్లే మాది."

ఆ బంధువును వదిలించుకొని ముందుకు నడిచాడు గోపాలం. కొంతదూరం నడిచేసరికి టౌన్‌హాలు తగిలింది. టౌన్‌హాలు చుట్టూ కార్లూ బళ్లూ ఆగివున్నాయ్. తాంబూలం తీసుకొని సిగరెట్లు వెలిగించిన మనుషులు, సేలంకండువాలకు సెంటు రాసుకున్నవాళ్లు, సూట్లు వేసుకున్నవాళ్లు, లాల్చీ పంచె ధరించినవాళ్లు యిత్యాది పురుషులు—బెనారస్ చీర మొదలు జార్జెట్ చీరవరకూగల రకరకాల చీరలుకట్టిన లోలాక్షులు, పద్మాక్షులు—అంతా హడావిడిగా గుమిగూడి మాట్లాడుకుంటున్నారు. గోపాలం తెల్లమొఖంవేసి వాళ్ళకేసి చూస్తున్నాడు యిదేమిటో అర్థంగాక.

"సరిగ్గా సమయానికి దొరికావురా గోపాలం!"

గోపాలం పక్కకుతిరిగి చూశాడు. ట్రెయినుకు లేటైపోయిన మనిషిలా కంగారుపడుతూ సత్యం కనిపించాడు.

"ఇవేళ యిక్కడ అద్భుతమైన సంగీతసభ జరుగుతోంది. యిది చూడకపోయినా యిటువంటి అవకాశం జన్మలో దొరకదు. టిక్కెట్ కొనడానికి రెండణాలు తక్కువవచ్చినై. చూడు, కేవలం రెండణాలకోసం సంగీతంమీదగల అభిమానాన్ని చంపుకోమంటావా?" సూటిగా అడిగాడు.

"ఎంతమాత్రం నీ అభిమానాన్ని చంపుకోవద్దు" అన్నాడు గోపాలం.

"అయితే రెండణాలు ముందిలా పారెయ్" అన్నాడు సత్యం తేలికగా చెయ్యిచాచి.

గోపాలం ముందు తెల్లముఖంవేశాడు. తరవాత తేరుకోని "నే డబ్బుకోసమే వూరిమీదికి బయలుదేరాను. నీకు రెండణాలు కావాలి, నాకు రెండురూపాయలు కావాలి. నాతో వస్తే రా! మన యిద్దరికీ ఎవడైనా కలియుగ కర్ణుడు ఎదురౌతాడేమో చూద్దాం" అన్నాడు.

"నీ సలహాకు సంతోషం! నా తంటాలు నేపడతానులే, యిక నువ్వు దయచెయ్!" సత్యం జనసమూహంలోకి వెళ్ళిపోయాడు. గోపాలం ముందుకుసాగాడు కొంతదూరం నడిచేసరికి ఒక ఫాన్సీ స్టోరులో ఏదో కొంటున్న విశ్వం కనిపించాడు. విశ్వం ఒకప్పుడు తన క్లాస్‌మేట్. బాగా డబ్బున్నవాడు. యితన్ని పట్టుకుంటే యివేళకి రెండురూపాయలు దొరక్కపోవు. ఉత్సాహంతో విశ్వాన్ని సమీపించి 'ఏంరోయ్ విశ్వం! బాగున్నావా?'' కుశలప్రశ్న వేశాడు గోపాలం.

"ఓహో! నువ్వా గోపాలం! చాలాకాలానికి కనిపించావురా! మా యింటికిపోయి కొంతసేపు కూర్చుని మాట్లాడదాం!" ఆహ్వానించాడు విశ్వం.

గోపాలానికి చాలా తొందరగా ఉంది. అప్పుడే రాత్రి ఎనిమిది గంటలయింది. మరో అరగంటలో వూళ్లో కొట్లన్నీ మూసేస్తారు. తన ప్రాణానికి బంధువు ఒకడు వచ్చి కూర్చున్నాడు. కొట్లు మూసినతరవాత డబ్బు దొరికినా లాభం లేదు. ఇద్దరూ విశ్వం యిల్లు చేరుకునేసరికి ఎనిమిది గంటలు దాటింది.

"నీకు సాహిత్యంలో కొంచెం ప్రవేశంవుంది కాదుట్రా గోపాలం?" అడిగాడు విశ్వం.

కడుపులో కాలుతూవుంటే యిప్పుడు సాహిత్యగోష్ఠి జరుపుతాడేమోరా భగవంతుడా అనుకుని దిగాలుపడి "ఏదో వెనక వుండేదిలే!" అన్నాడు నిరుత్సాహంగా.

"నాకు యీ సంవత్సరంలో ఎక్కువ ఆస్తి కలుస్తుందని ఒక గొప్ప జ్యోతిష్కుడుచెప్పాడు" అన్నాడు విశ్వం ఉత్సాహంగా.

తలా తోకా లేని యీ మాటల అర్థం గోపాలానికి బోధపడలేదు. రెండు నిముషాలైనా మాట్లాడకుండా డబ్బు అప్పు అడిగితే మర్యాదగా వుంటుందా? అందుచేత ఏదో కొంతసేపు మాట్లాడ్డం మంచిది.

"దగ్గర బంధువుల ఆస్తి ఎవరిదైనా కలిసే అవకాశం వుందేమో?" అన్నాడు గోపాలం.

"మనకు ఆస్తివున్న బంధువు లెవరూ లేరు. యిక ఆస్తి కలవడానికి మార్గాలేమిటా అని ఆలోచించగా 'పజిల్సు' కనిపించినై. అప్పటి నుంచి పజిల్సు వేయడం ప్రారంభించాను" అన్నాడు.

గోపాలానికి విశ్వం వ్యవహారం చూస్తుంటే ఒళ్లు మండింది. ఎవడో ఆస్తి కలుస్తుందన్నాడట!-వీడు పజిల్సు కడుతున్నాడట! అసలు పజిల్సు కట్టేవాళ్ళను కనికరించకూడదు. వీళ్లంతా దోపిడి మనస్తత్వం కలవాళ్లు ఒక అర్థరూపాయ పెట్టుబడిపెట్టి మిగిలిన లక్షలకొద్దీ జనం కట్టిన సొమ్మును దోపిడి చెయ్యడానికి ప్రయత్నిస్తారు. తనకే అధికారం వుంటే పజిల్సు కట్టే యీ సోమరు లందరినీ జైలులో పెట్టివుండేవాడు. కాని-తను-యిప్పుడు యిక్కడికి వీడిని మరామత్తు చెయ్యడానికి రాలేదు. రెండు రూపాయల అప్పు కోసం వచ్చాడు.

"రెండురూపాయలంటే యిస్తావురా విశ్వం. నీకుమళ్ళీ ఒకటవతేదీని యిస్తాను." అన్నాడు సంశయిస్తూ గోపాలం.

"వెధవ రెండురూపాయలు! రెండువందలు తీసుకువెళ్ళరా-యిప్పుడు లోటేమిటి?" అన్నాడు నిర్లక్ష్యంగా విశ్వం.

డ్రాయర్‌లోంచి కాగితాలు తీశాడు విశ్వం. రూపాయికాగితాలుకావు- పజిల్సు కాగితాలు.

"యీ పజిలంతా పూర్తిచేశాను. కానిఇంకా నాలుగుమాటలుమాత్రం మిగిలిపోయినై. యిది చూడు. 'యిది యింటిలో తిరుగుచుండును' అన్నాడు. చివరి అక్షరంమాత్రం '—ల్లి.' నల్లి, బల్లి, పిల్లి యీ మూడిటిలో ఏది సరైనదంటావు?" ప్రశ్నించాడు.

"మూడూ సరైనవే!" అన్నాడు గోపాలం.

"ఏడిసినట్లువుంది! అందులో ఏదో ఒకటి చెప్పరా బాబూ!" చిరాగ్గా అన్నాడు విశ్వం.

"'పిల్లి' అని పూర్తిచెయ్యి. బహుశా అది రైటై వుండొచ్చు!" అన్నాడు గోపాలం.

"సరే! అది పూర్తిచేశాను. ఇక యిది చూడు. దీని చివరి అక్షరం '-చం' యిది కొందరికి ఆనందమును కొందరికి దుఃఖమునూ కలిగించును అని వుంది. ఇది బహుశా మంచం అయివుంటుందను కుంటున్నాను. ఎందుకంటావా? ఆరోగ్యంగా వున్నవాళ్లకు మంచం ఆనందాన్ని యిస్తుంది. రోగంతో బాధపడుతున్నవాళ్ళకు దుఃఖాన్ని కలిగిస్తుంది" అన్నాడు విశ్వం.

"మంచంకాదు కంచం! కంచం నిండినవాడికి సుఖం, నిండని వాడికి దుఃఖం" అని దిద్దాడు గోపాలం. యీ సవరణ విశ్వానికికూడా నచ్చింది గనక సరిపోయింది.

"సరే! ఇక యిదిచూడు, '-మ' అని వుంది. ఇది నిత్యం యింట్లోవుంటూ మనకు బాధ కలిగించును. చీమ, దోమ యీ రెండిటిలో ఏదోఒకటి అవుతుందనుకుంటాను" అన్నాడు విశ్వం.

"నిత్యం యింట్లోవుంటూ మనకు బాధ కలిగించేది చీమాకాదు దోమాకాదు భామరా! బాబూ భామ!" అన్నాడు గోపాలం.

ఇంతలో ఒక యువకుడు తొందరగా గదిలో ప్రవేశించాడు. "ఇంకా యిక్కడే కూర్చున్నా వట్రా విశ్వం. రిజల్ట్సొచ్చేటైమైంది. లే" అన్నాడా యువకుడు తొందరగా.

ఆ యువకుడూ విశ్వం యిద్దరూ కొంపలు కాలిపోతున్నట్లు ఆకస్మికంగా లేచి బయలు దేరారు.

"డబ్బు మాటేమి చెప్పావురా విశ్వం?" అన్నాడు గోపాలం ఆత్రంగా.

"ఇప్పుడు నాకు మాట్లాడ్డానికికూడా తీరుబడి లేదు. ఇదిగో యీపర్సు తీసుకువెళ్లు" పర్సుయిచ్చి యిద్దరూ తొందరగా వెళ్ళిపోయారు.

వాళ్లుపోతే పోయారు. ప్రస్తుతం తనకు డబ్బు దొరికిందికదా అనే సంతోషంతో గోపాలం బయటకువచ్చాడు. కాని పర్సు తెరిచి చూసేసరికి అతని ముఖం సున్నంకొట్టినట్లు తెల్లబడింది. ఆ పర్సునిండా వున్నవి రూపాయి కాగితాలుకావు, అంతకంటే విలువైన పజిల్సు కాగితాలు.

---

ఇరవయ్యో శతాబ్దంలో

# విగ్రహారాధన

ఏ. ఎస్. ఆర్. అంజనేయాచారి

శతాబ్దాల క్రిందట మొదలు పెట్టబడింది యీ శిలావిగ్రహ పూజాపునస్కారణ. కారణం? ఆదర్శప్రకారం ఏమిటంటే మానవాకారాలు, మనస్సు ఎలా చెపితే అలా చేయకుండా మంచి చెడ్డలను విమర్శించి, భక్తి విజ్ఞానాలతో సత్యం... ధర్మం...న్యాయం మొదలగు దేశక్షేమకర నియమాలను పాటించాలని చెప్పి అలా చేయకపోతే యమలోక యాతనల ననుభవిస్తారనిన్నీ, కాబట్టి భయభక్తులు కుదిరేందుకని, శిలావిగ్రహములను చేసి వాటిని అలంకరించి..."ఇందుగల డందులే డను సందేహమువలదు మూఢా"—అని బోధించి కృతకృత్యులయ్యారు పెద్దలు!

కాని మనవారంతా సూక్ష్మగ్రాహులు... కొందరు పెద్దలు కేవలం అవతారమూర్తుల్లా మన పాలిట వెంచేసి వివిధమతాల సృష్టిజేసి తమతమ ఇచ్ఛాదేవతల నెలకొల్పారు. "అలా ఎందుకు చేయవలసివచ్చింది మహాశయా! దేవుడనేవాడు ఒక్కడే కదా?" అని ఏ అమాయక హృదయుడైనా ప్రశ్నిస్తే యీ మహాప్రపంచంలో ఎనుబదినాలుగుకోట్ల జీవరాసులకు అనుదిన మూ అక్కరకొచ్చే 'స్వార్థపరత్వ' మని ఠప్‌మని చెప్పొచ్చు. మతమనే మహావృక్షానికి మూల విరాట్టులైనారనే పేరు కావాలట! "రామానుజం, మాధ్వం...శంకరం" యీ మహా మహులంతా వచ్చి మనల్ని ఉద్ధరించిందేమంటే—మా మా మతాల్లో చేరండి! లేకపోతే ఇనుపగానుగుల్లో నలిపేస్తాం అంటూ ఆర్భాటాలుచేసి రాజుల మధ్య విద్వేషాలు నెలకొల్పి వాళ్లు పోయేముందు తమ శిష్యబృందానికి నూరిపోసి మరీ పోయారు. ఆ మహారణగుణధ్వనులే యింతవరకు కొలువి దెయ్యాలై మనల్ని మన దేశనాయకులను పీడిస్తున్నాయి! పోనీ యింతశ్రమపడ్డారు, ఎవరైనా మోక్షమనే కొండ ఎక్కారా? అని ధర్మ సందేహం. ఎవరైనా అలా అడిగారూ అంటే మూడుమాటల్లో ముచ్చటైన సమాధానం వచ్చిందంటే మనం గుడ్లప్పగించి గుటకలు మ్రింగవలసిందే. కాని మనం నమ్మవలసింది ఏమైనా ఉంటే నమ్మొచ్చు.

పురాణాల్లో చెప్పి ఉంచారుట—ధృవుడు. మార్కండేయుడు మొదలగు మహాత్ములు మోక్షాన్ని చాలా ఖరీదుపెట్టి కొనుక్కొచ్చారని. జీవితావసానంవరకూ నిద్రాహారాలుమాని, కడుపుకట్టుకొని మరీకూడబెట్టిన ధనం వెచ్చబెట్టి మోక్షము అనే పట్టాను పొందారట! కాని యిప్పటి సాంబారు భక్తాగ్రేసరులకు, నిత్య చీకటి వ్యాపారస్తులకు అదేదో లభించదంటూరు. ఏం? వీళ్లుమాత్రం వా